



జమ్ముతావి నుంచి మద్రాసు వెళ్ళే ఎక్స్‌ప్రెస్ రైలు విజయవాడ స్టేషనులో అయిదవ నెంబరు ప్లాట్‌ఫారం మీద ఆగి ఉంది. టైము ఉదయం పదిన్నర గంటలయింది. ప్లాట్‌ఫారం అంతా సందడిగా ఉంది. కోలాహలంగా ఉంది. బండి బయలు దేరటానికింకా ఇరవై నిముషాల వ్యవధి ఉంది. మోహన్రావు మరోసారి విసుగ్గా వాచీ చూసుకున్నాడు— అక్కడికేదో తను అన్నీ టైము ప్రకారమే చేస్తున్నట్లు! ప్చ్!ప్చ్! అనుకున్నాడు అలవాటు ప్రకారం. నిజానికి దాని అర్థం అతనికే తెలియదు. అక్కడికీ....ప్లాట్‌ఫారమ్ మీద నాలుగయిదుసార్లు అటూ యిటూ సర్వే చేశాడు. అందమైన ఆడశాల్తీని కళ్ళతోనే తాగేశాడు! వీలయినంత వరకూ వాళ్ళ శరీరాన్ని సుతారంగా తాసుకుని స్పర్శసుఖం అనుభవించాడు. ఆగిఉన్న రైలుపెట్టెలపక్కన నడుస్తూ....లోపల కనుపించే రమణీ మణుల అందచందాలను తదేకంగా చూసి మధురోహాలతో పులకించిపోయాడు కూడానూ. అతనికి ఏమీ తోచటంలేదు. అదేం ఖర్మమో పాపం!

అక్కడ నిల్చుని ఓ కంపార్టుమెంటులోకి చూస్తున్న మోహన్రావుకు కళ్ళు జిగేలుమన్నాయి! విద్యుల్లత మెరిసినట్లయింది. ఓ అందాల కుందనపు బొమ్మ....నవయవ్వన జవ్వని....కిటికీ పక్కగా ఉన్న సింగిల్ సీట్లో కూర్చుని దర్శనమిచ్చింది. 'ఇందాకటినుంచీ ఏమయింది చెప్మా? ఈ లావణ్యవతి!' అనుకున్నాడు మోహన్రావు. తనకళ్ళే తనను మోసం చేసినవని వాటిని అన్యాయంగా తిట్టుకున్నాడు!

ఏమయినా సరే ఆమె దృష్టిని ఆకర్షించాలని .... ఆమెతో మాట్లాడాలనే కోరిక బలంగాకలిగింది మోహన్రావుకి. అయితే దాన్ని కార్యరూపంలో పెట్టటం ఎలా? ఇదీ అతనికి పట్టుకున్న సమస్య! వ్యవహారం బెడిసికొట్టిందంటే ఆ అమ్మడు స్లిప్పర్లు తన చెంపల్ని బలంగా ముద్దుపెట్టుకోవటమే కాకుండా ....మిగతావాళ్ళుకూడా తన వీపుమీద ప్రేమగా పిడిగుద్దులు గుద్దుతారన్న విషయం మోహన్రావుకు తెలియనిది కాదు!

అందుకని మోహన్రావు .... తన బుర్రకు పదును పెట్టాడు! సానబట్టాడు! పట్టగా పట్టగా....ఓ దివ్యమైన ఆలోచన పుట్టుకొచ్చింది! "ఎక్సలెంట్!" అనుకున్నాడు మోహన్రావు. తనను తానే అభినందించుకున్నాడు. వెంటనే అమలు జరపడానికి నిశ్చయించుకున్నాడు.తనకేమన్నా అయితే....అలాంటి వారికి ఆలోచనలకు తావివ్వ దలచుకోలేదతను.

బాణంలా ఆమె కూర్చున్న చోటికి వెళ్ళాడు! ఆమెవేపు చూసి చిరునవ్వు నవ్వాడు. పోనీ....ఆమెగూడా ఓ చిరునవ్వు నవ్వితే ఏం పోయిందీ? అనుకున్నాడు. కారణం— ఆమె నవ్వలేదు సరిగదా....మిర్రి మిర్రి చూసిందతని వేపు....“ఒళ్ళు ఏమంటోంది?” అన్నట్లు. అంత మాత్రానికే అధైర్యపడిపోతే తన ఆలోచన సంగతేమవుతుందిపాపం? అందుకని .... గుండెలనిండా ఓసారి గట్టిగా గాలి పీల్చిన మోహన్రావు ధైర్యాన్ని ఎరువు తెచ్చుకున్నాడు!

“మిస్!” అన్నాడు ఆమెతో. అసలామె మిస్సో....!మిసెస్సో....!మోహన్రావుకు తెలియదు! ఇంతటి లేజవ్వని. మిసెస్సెలా అవుతుందని మోహన్రావు లాజిక్!

“ఎస్!” అందామె .... తన చేతిలో ఓ కత్తి లాంటిదే గనక ఉంటే మోహన్రావ్ నెత్తి బద్దలు కొట్టేటంతకోపాన్ని ప్రదర్శిస్తూ.

“మీపేరు చంద్రికారాణి గదూ?”

“చంద్రికారాణీ కాదూ....! మహారాణీ గాదు....!”

అయినా నాపేరు మీకెందుకు? నొసలు చిట్లించిందా చిన్నది.

“మీ పేరు నాకెందుకు అంటారేమిటి? తప్పక కావాలి!”

“అదే! ఎందుకూ అంటున్నాను?” అంది చిరాగ్గా.

“మీరందంగా ఉన్నారు గనక! చూడండి!మీఅందం ప్లాట్‌ఫారమ్అంతా

లా కాంతులు వెదజల్లుతుందో!"

"ఏయ్ మిస్టర్! బిహేవ్ యువర్ సెల్ఫ్! చూస్తే ఎడ్యుకేటెడ్‌లా ఉన్నావు!"

"సరిగా బిహేవ్ చెయ్యకపోతే ఏం చేస్తారేమిటి?" మొండిగా ప్రశ్నించాడు మోహనరావు.

"నలుగురితో బుద్ధి చెప్పిస్తాను. దేహశుద్ధి చేయిస్తాను. పోలీసను పిలిచి లాకప్పులో పెట్టిస్తాను"

"గాడిదగుడ్డు! మీవల్ల ఏం కాదు!"

అప్పటికే ఒకళ్ళిద్దరు కంపార్టుమెంటులో వాళ్ళు జోక్యం కలిగించుకున్నారు. "ఏయ్! అబ్బాయ్! ఎందుకలా ఆ అమ్మాయిని అల్లరి పెడతావ్?" అంటూ.


వినిపించుకోనట్టు నటించాడు మోహనరావు. ఇలా లాభం లేదనుకున్నాడు. ఒక్క క్షణం ఆలోచించాడు అంతే!! దోరు దగ్గరకు పరుగెత్తి హనుమంతుడిలా ఒక్క గెంతు గెంతాడు లోనికి! ఒక్కదాటున ఆమె దగ్గరకి వచ్చాడు. అమె భీతి హరిణేక్షణలా చూసోంది. అమాంతం ఆమెను అతని చేతులతో చుట్టేసి.... బుగ్గమీదముద్దుపెట్టుకున్నాడు! ఈ హఠాత్సంఘటనకు ఆమె నిర్ఘాంతపోగా కంపార్టుమెంటులోని వారందరూ విస్మేరపోయారు.

అమె "హెల్ప్! హెల్ప్!" అంటూ అరిచింది. జనం చాలామంది పోగయ్యారు– ఏమిటి ఏమిటంటూ.

మరుక్షణంలో మోహనరావుకు దేహశుద్ధి ఘనంగా జరిగేదే!!

చటుక్కున కిటికీలోనుంచి దూకేశాడు. దూకటమే తడవు రెండుచేతులు గాలిలోకి తిప్పుతూ.... కాళ్ళు నేలకేసి బాదుతూ కళ్ళు .... పళ్ళు వికృతంగా కనబరుస్తూ డాన్సు చెయ్యసాగాడు!

చితకబాదుదామనివచ్చిన మగధీరులు ....అతను చేసిన పనిని అసహ్యించుకుంటున్న ఆడవాళ్ళు .... దారుణానికి




గురయి సిగ్గుతో చితికిపోయి తలవాల్చుకున్న ఆ అమ్మాయి .... ఇంకా ప్లాట్‌ఫారమ్‌మీదున్న తదితరులు చోద్యం చూడసాగారు.

ఏవో పాటలు పాడేస్తున్నాడు మోహనరావు.

"చెలియా కనరావా! నన్నొదిలి కాలేజీ స్టూడెంటుతో లేచి పోయితివా?"

"కలవరమాయే కంపార్టుమెంటులో! నా తల వక్కలాయే వీళ్ళ చేతుల్లో?"

"అయ్యయ్యో! బ్రహ్మయ్యా! అన్యాయం చేశావేమయ్యా! ఈ ఇండియాలో పుట్టించావేమయ్యా?"

పాటలు ఆపేశాడు మోహనరావు హఠాత్తుగా! కాని డాన్సుమాత్రం ఆగలేదు. ఇక వాగుడు ప్రారంభించాడు.

"మహాజనులారా! నేనెవరనుకుంటున్నారు? రాజును! వట్టి రాజును గాదు! ఈ సకల భువనాలకు సామ్రాజ్యాధిపతిని! మీరంతా నాకు మొక్కండి! లేదా ఉప్పు పాతరలోవేసి తొక్కండి!!

సడన్‌గా .... ఆకాశంవేపు వేలు చూపించాడు మోహనరావు "అదుగో"! అంటూ. ఏమిటో? అన్నట్టుగా అటు చూశారు ప్లాట్‌ఫారమ్‌మీద ఉన్న జనం. కంపార్టుమెంటులో ఉన్నవారు "అరె! మేము చూడలేకపోయామే!" అనుకుని బాధపడ్డారు.

"నేనిప్పుడెక్కడనుంచి వస్తున్నానో తెలుసా? అక్కడ్నుంచి.!! అదేనయ్యా! అలా తెల్లబోయిచూస్తారేమిటి? దేవేంద్రలోకంనుంచి! అయిదునిముషాలవరకు నేను, రంభా కలిసి.... ఇంద్రుడి కళ్ళల్లో కారంకొట్టి.... బీచి ఒడుకు చెక్కేసాం! విస్కీబాటిల్స్ పట్టేశాం! సిగరెట్టుకాల్చేశాం! సేరవా పీల్చేశాం! మటన్ ఊదేశాం! బీచిలో పడి దొర్లాం. పొర్లాం! కాని రంభ నన్ను మోసం చేసింది. బుగ్గల మీద ముద్దులు కురిపిస్తున్నానేను. అంతలో మాయమయింది రాక్షసి! ఇంద్రా! అని అరిచాను. ఇంద్రుడు దగ్గరకెళ్ళి కాలరు పుచ్చుకుని అడిగాను. ఏంచేసావ్‌రా సన్నాసీ నా రంభను అని. భూలోకానికి వెళ్ళిరె ళ్ళలో వెతుకు! అన్నాడు ఆ ఇడియట్." ఎవరో నా వీపుమీద చరిచి నోరునొక్కినట్టుమాటల్నిమధ్యలో ఆపేశాడు. మోహనరావు. జుట్టుపీక్కున్నాడు.! చొక్కాను ఉండలుండలుగా నలిపేశాడు.! గాలిలోకి చప్పట్లుకొట్టాడు. జనాన్నిచూసి ఇకిలించాడు. కంటిగుడ్డు భయంకరంగా చూపించాడు. జనాన్ని చూసి ఇకిలించాడు. కంటిగుడ్డు భయంకరంగా చూపించాడు. వీపు గోక్కున్నాడు. ఎగిరి గంతేసి కిందపడ్డాడు.

జనానికికేసు అర్థమయిపోయింది. జాలి పుట్టుకొచ్చింది.

"ఒరేయ్ పాపం మెంటలుగాడురా!" అన్నారు కొంతమంది.

"కుర్రాడు ఎర్రగా బుర్రగా అందంగా ఉన్నాడు. ఏం ఖర్మో? పా ," అన్నారు మరికొంతమంది.

"చూస్తే చదువుకున్న వాడులాగానే ఉన్నాడు. ప్రయోజకుడై ఎంతో సంపాదించ వలసినవాడు ఎలా అయిపోయాడు?" వాపోయాడు గుంపులోని ఓ తండ్రి.

"భగ్నప్రేమికుడురా. వాడి ప్రేయసి మోసం చేసి ఉంటుంది. లేకపోతే ఆ అమ్మాయి మీద అంత అఘాయిత్యం చెయ్యలేడు!" ఎవరోకాలేజి స్టూడెంట్ సానుభూతి చూపించాడు. మోహన్రావుకు పట్టిన అదృష్టానికి మనసులో అసూయపడుతూనే.

మదపిచ్చిలాగుంది అనుకున్నారు అచ్చటి నారీమణులు.

చివరికంతా కలిసి మోహన్రావును పిచ్చివాడుగా నిర్ణయించేశారు.

"పిచ్చివాడి చేతిరాయి ఏటు విసరబడుతుందో ఎవరికి తగులుతుందో ఎవరికి తెలుసు? మీకు జరిగిన అపచారం గూడా అలాంటిదేనమ్మా! దీంట్లో మీ తప్పేంలేదు! మీరేమీ విచారించకండి.! అసలు ఏమీ జరగలేదను కొని మరచిపొండి! వాడు పిచ్చివాడు గనుక వదిలేశాంగానీ....లేకపోతే మక్కెలు విరగదన్ని....ఎముకలు ఏరి....ప్లేటలో పెట్టిమీకు చూపించేవాళ్ళం!" అంటూ ఓదార్చారు ఆ అమ్మాయిని. చేసేదేమీ లేని ఆ అమ్మాయిగూడాసర్దుకుపోయింది

ఈ లోపుగా మైకులో ఎనౌన్సుమెంటు వినిపించింది. రైలు అయిదు నిముషాలలో బయలుదేరుతుందని. "అంతా అయిన తర్వాత గదా నేవచ్చేది! అన్నట్టుగా రైల్వేపోలీసు వచ్చాడు అక్కడికి. "ఏయ్! ఏమిటి గలాభాఅంతా?" అంటూ అదలిస్తూ "రెడ్డొచ్చె మొదలాడు"....అన్నట్లుగా వివరంగా చెప్పాడతనికి. ఒకరిద్దరు టి.టి.ఇలుఅటుఇటు వెడుతూ మనకెందుకులే అన్నట్లుగా వెళ్ళిపోయారు చూడకుండా.

తన అధికారమంతా ప్రదర్శిస్తూ "ఏయ్! ఎక్కడికిపోవాలినువ్వు? అసలు టిక్కెట్టుందా! లేదా! చెప్పు! లేకపోతే మూసేస్తాను!" అన్నాడు గట్టిగా - బొంగురు గొంతుతో-పోలీసు.

మళ్ళీ జుట్టుపీక్కుని కాళ్ళు చేతులు వళ్ళు అసహ్యంగా గిచ్చుకుని లేచినిలబడి గంతేసి జేబులోంచి టిక్కెట్టుతీసి రూపాయికాసు ఎగరేసినట్టు గాలిలోకి ఎగరవేశాడు! ఆ టిక్కెట్టు ఎవరి చేతిలోనే పడింది. "తెనాలి" అని అరిచాడు ఆ టిక్కెట్టు పట్టుకున్న అతను. "తెనాలి" అన్నపేరు వినగానే ఆ అమ్మాయిగుండెల్లోరాయి పడింది! గజగజ వణికిపోయింది! చిగురుటాకులా.! ఈ లోపుగా రైలు కూతవేసి కదిలింది. మోహన్రావు గబుక్కున అతని చేతిలోనుంచి టిక్కెట్టు లాక్కుని....అడ్డంగా ఉన్న ఒకరిద్దరిని బలంగా తోసేసి.... మిల్ఖాసింగ్‌లా పరుగెత్తి....వేగంపుంజుకుంటున్న రైల్లోకి ఒక్క గంతేసి.... ఇంజన్ పక్కనున్న కంపార్టుమెంటులో పడ్డాడు.

'పిచ్చిముండావాడు' మరోసారి అనుకున్నారు ప్లాట్‌ఫారమ్‌మీద ఉన్నజనం.

"భలేకేసు దొరికింది! ఇవ్వాళ ఎవరి ముఖంచూశానో?" అనుకుంటూ నీరసంగా వెనుదిరిగాడు రైల్వే పోలీస్. తనికేమీ పట్టనట్లు పరుగెత్తుతూనేఉంది జమ్ముతావి-మద్రాస్ ఎక్స్‌ప్రెస్.

* * *

నాలుగురోజుల తరువాత మోహన్రావు తండ్రికి ఓ ఉత్తరం వచ్చింది తెనాలినుంచి. విజయవాడ లబ్బీపేటలో- ఓ పెద్ద భవనంలో హాలులో ఖరీదైన సోఫాలో పడుకున్నట్లుగా కూర్చుని... ఆ ఉత్తరాన్ని ఇలా చదువుకున్నాడాయన.

"గౌరవ నీయులు సుబ్బరామయ్య గారూ! మీకు నమస్కారాలు చెప్పలేని

మా ఖాతాదారులకు, శ్రేయోభిలాషులకు, మిత్రులకు శుభాకాంక్షలు

టెలిఫోన్స్:- 74952 (వర్క్స్)
76652 (రెసిడెన్స్)

శ్రీగౌరి ఇంజనీరింగ్ వర్క్స్


స్ట్రక్చరల్ ఇంజనీర్స్ ట్యూబ్యులర్ ట్రస్ మాన్యుఫాక్చరర్స్.

హనుమాన్‌పేట * విజయవాడ-3.

నా అనర్థతకి మన్నించండి! ముందు మా అబ్బాయి మీ అమ్మాయిని చూసి "నచ్చింది" అని చెప్పిన తరవాతనే మే మిద్దరం గూడా వచ్చిచూస్తామన్న మీ అభ్యుదయభావాలకు ఆధునిక అభిప్రాయాలకు నా జోహార్లు.! మీ ఇష్ట ప్రకారం అలాగే పెళ్ళిచూపులు ఏర్పాటు చేశాను నేను. మీఅబ్బాయి తెనాలి మా యింటికివచ్చాడు. సాయంత్రం నాలు గింటికి–ఆరోజున మీఅబ్బాయినిచూశాం మేము! చాలా బాగున్నాడు. పచ్చటి పసిమి ఛాయతో మిలమిలమెరిసి పోతు న్నట్లున్నాడు,.! అందంగా .... హుందాగా.... దర్పంగా ఉన్నాడు! మీకున్న ఆస్తిపాస్తుల వివరాలు ముందే తెలుసు కొన్న మేము...బి.ఎస్ సి పాసయిన మీ అబ్బాయికి...మీరు పలుకుబడితో ఇప్పించ బోయే ఉద్యోగాన్ని గూర్చి తెలుసుకుని...త ల చు కు ని....అమితంగా సంతోషించాము! మా అమ్మాయిని సంతోషంగా మీ అబ్బాయికి ఇవ్వాలనే నిర్ణయానికివచ్చాము. ఎందు కంటే హీరోలా ఉన్న మీ అబ్బాయి మా అమ్మాయికి తప్పక నచ్చుతాడని మా నమ్మకం!

కానీ .... సుబ్బరామయ్యగారూ....! తలుచుకుంటే నా వంట్లో బి.పి. నాలు గొందలు డిగ్రీలు ఒక్కసారిగా పెరుగు తోంది.?! మిమ్మల్నమాంతం గొంతు నులిమివెయ్యాలని పిస్తోంది.!! ఇంత మోసం చేస్తారా? ఇంత దగా చేస్తారా? మీ అబ్బాయికున్న "జబ్బు"ను దాచి పెట్టినయవంచన చేస్తారా? మాఅబ్బాయే ముందువస్తాడు....పెళ్ళి చూపులకు.... అవి మీ రెందుకన్నారో ఇప్పుడర్థమవు తోంది నాకు! పెళ్ళిచూపులలో మీ అబ్బాయిని చూడగానే మా అమ్మాయికెవ్వున కేకేసి పడిపోయిన తర్వాత ...తిరిగి తెలివొచ్చిన తర్వాత గుచ్చిగుచ్చి అడిగితే చెప్పబట్టిగానీ....లేకపోతే మాకేం తెల్సు? అంతాజరిగిపోయిన తర్వాత.... పంపేస్తే అయ్యో! ఇంకేమన్నా ఉందా? నిలువునా మా అమ్మాయి గొంతుకోసి ఉండేవాళ్ళం కామా? ఇలా....ఏ ఆడపిల్లల మరియు వారి తండ్రుల జీవితాల లోకూ చెలగాటలాడకండి.? నేనుగాబట్టి ఊరుకున్నాను.! ఇంకె మరొకరయితేనా?!

చీత్కారాలతో....!
"రామసుబ్బయ్య."




ఉత్తరం చదివిన సుబ్బరామయ్య మొహం కందగడలా తయారయింది. వెంటనే ఏదో గుర్తుకొచ్చి కోపంతో వణికిపోయాడు. "ఒరేయ్ మోహిగా!" అంటూ పెద్దగా అరిచాడు.

"ఏండాడీ?" అంటూవినయ విధేయత లొలక బోస్తూ వచ్చాడు మోహన్రావు.

"తెనాలిలో మొన్న ఏం నిరవాకం చేసిచచ్చావ్! అసలే ఎప్పుడూ ఏదో ఎడ్వెంచర్స్ అంటూవుంటావు! అలాంటి పుస్తకాలేచదువు తుంటావ్!"తీక్షణంగా ప్రశ్నించాడు సుబ్బరామయ్య. "నాకేం తెలియదు డాడీ!" అమాయకత్వం నటించాడు

"నీకేంతెలియకపోతే ఈ ఉత్తరమే మిత్రా ఇడియట్!" దాన్ని మోహన్రావు ముఖంమీదకొట్టి విసురుగా తన డ్రాయింగ్ రూములోకి వెళ్ళిపోయాడు సుబ్బరామయ్య

ఉత్తరమంతా చదివేశిన మోహన్రావు పసిపిల్లవాడిలా ఏడ్చేశాడు.... అయితే మనసులో మాత్రమే:

హత్యచేసి తప్పించుకోవటమెలా?
రేప్ చేసి తప్పించుకోవటమెలా?

పబ్లిగ్గా ఆడదాన్ని ముద్దుపెట్టుకుని తప్పించుకోవటమెలా? అలాంటి చెత్త పుస్తకాలను వివిధ భాషల్లో చదివి.... జీర్ణించుకుని....ఒళ్ళు పొగరెక్కి.... ప్రయోగాత్మకంగా తనుచేసిన (దు)స్సాహసం ఎలాంటి ఫలితమిచ్చిందోతెలుసుకుని విలవిలలాడి పోయాడు మోహన్రావు!

ఆ దగుల్బాజీ ఎడ్వెంచరే గనకతను చేసి ఉండకపోతే....!

ఆ అమ్మాయిని పబ్లిగ్గా ఆ ఒక్క ముద్దే గనక పెట్టుకోకపోతే....!

పిచ్చివాడిలా నటించి యుండకపోతే....! ఆ చిన్నారిని శాశ్వతంగాతన దాన్నిచేసుకుని....ఆమెతో స్వర్గసుఖాలు చవిచూడగలిగే అదృష్టం తనకు పట్టేదేదికాని ఇప్పుడనుకుని ఏం లాభం? మోహన్రావు కళ్ళల్లో నీళ్లు తిరిగాయి. కానీ అవిపనికిమాలిన కన్నీళ్లు!